క్లుప్తంగా

వెండి ఆభరణాల సమర్పణ

రంగంపేట: వడిశలేరులోని శ్రీదేవి-భూదేవి సమేత భజే నారాయణస్వామి దేవస్థానం ఉప ఆలయంలో గోదాదేవి అమ్మవారికి ఆ గ్రామానికి చెందిన దాత దంపతులు కిలోన్నర వెండితో పళ్లెం, రెండు హస్తాలు, రెండు కనుబొమ్మలు, కళ్లు, బొట్టు తయారు చేయించారు. ఈ ఆభరణాలను శుక్రవారం ఆలయ అర్చకుడు మురళీ కృష్ణమాచార్యులు, శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మావిరెడ్డి వీర్రాజు, ధర్మకర్త వల్లూరి సూర్యభాస్కరరావు, ఆలయ సిబ్బంది హనుమంతరావు సమక్షంలో దేవస్థానానికి అందించారు.

వ్యాయామంతో ఆరోగ్యం

పెదపూడి: చక్కని జీవన శైలి, మంచి ఆహార అలవాట్లు, నిరంతర వ్యాయామంతో మధుమేహాన్ని దూరం చేయవచ్చని లయన్స్ క్లబ్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం జి.మామిడాడ ఎస్సీపేట, బసివిరెడ్డి పేటలలో లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్య ఇంటర్నేషనల్ ఆదేశాలతో మధుమేహంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. డాక్టర్ గాయత్రి, ఆర్ఎఆర్‌కే చౌదరి, సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, పప్పు రామకృష్ణారెడ్డి, అప్పారావు పాల్గొన్నారు.

జూలైలో సాగునీరు విడుదల

సీతానగరం: ఖరీఫ్ సీజన్‌కు తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ నుంచి జూలై మొదటి వారంలో సాగునీరు విడుదల చేస్తామని ఏఈ ఏ.శివ ప్రసాద్ తెలిపారు. పురుషోత్తపట్నంలోని తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ కుడి, ఎడమ కాలువలకు రక్షణ గోడలు, రెగ్యులేటర్లు, సైఫాన్లు వంటి 16 పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.

కట్నం వేధింపులపై కేసు

సీతానగరం: ముగ్గళ్లకు చెందిన యాపాక సుచిత్రను కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్న భర్త యాపాడ శ్రీను, మరిది దుర్గాప్రసాద్‌పై ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ గోవిందరాజులు శుక్రవారం తెలిపారు. ముగ్గళ్లకు చెందిన సుచిత్రకు గోకవరానికి చెందిన యాపాడ శ్రీనుతో వివాహమైంది. ఆమెను కట్నం కోసం వేధిస్తుండటంతో రెండు నెలల క్రితం ముగ్గళ్లలోని అమ్మవారి ఇంటికి వచ్చింది. అయినా ఫోన్‌లో వేధిస్తుండడంతో మనస్తాపం చెందిన సుచిత్ర గురువారం గోదావరిలో దూకి ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను స్థానికులు కాపాడి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యువకుడి అదృశ్యం

గోకవరం: కొత్తపల్లికి చెందిన బంటుపల్లి సాయివంశీ స్నేహితులతో ఎక్కువగా కాలం గడుపుతుండటంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్థాపం చెంది ఈ నెల 21న రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హెచ్‌సీ శ్రీనివాస్‌రావు కేసు నమోదు చేశారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

సీతానగరం: రఘుదేవపురం శివారున పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.5,120 స్వాధీనం చేసుకున్నట్టు హెడ్ కానిస్టేబుల్ గోవిందరాజులు శుక్రవారం తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

ఉపాధి పనులపై ఆడిట్

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి, గాడాల, మధురపూడి గ్రామాల్లో శుక్రవారం ఎన్ఆర్ఈజీఎస్ పనులపై సోషల్ ఆడిట్ జరిగింది. ఆయా సచివాలయాల సెక్రటరీలు జాకబ్‌రాజు, సత్యానందకుమార్, సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో గ్రామంలో జరిగిన పనులు, వేతనదారులు చేసిన పనులు, తదితర వివరాలను చదివి విన్పించారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు

మధురపూడి: మాదక ద్రవ్యాలతో అనేక అనర్థాలు కలుగుతాయని సెబ్ కోరుకొండ సీఐ జి.సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కోరుకొండ హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సెబ్ సర్కిల్ పరిధిలోని కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు..

విద్యాకానుకల పంపిణీ

రాజానగరం: పుణ్యక్షేత్రం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం జగనన్న విద్యాకానుక కిట్లను జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, ఎంపీపీ మండారపు సీతారత్నం పంపిణీ చేశారు. అలాగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన యర్రంశెట్టి దేవీ శ్రీలత, షేక్ దాత్రి, వై.ఉమామహేశ్వరికి సర్టిఫికెట్లు, నగదు బహుమతులు ప్రదానం చేశారు. పీఎంసీ చైర్మన్ కట్టుబోయిన ఏసురత్నం, సర్పంచ్ మరుకుర్తి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ పలివెల వెంకట్రావు, ఎంఈఓ జ్యోతిప్రసాద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, చిత్రంలో విజయలక్ష్మి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- అధికారులతో సమావేశం

రాజానగరం: రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలన్నింటినీ పరిష్కరించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. దీనిని పూర్తిస్థాయిలో విజయవంతం చేయడానికి అధికారులు కీలకపాత్ర పోషించాలన్నారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటింటా సర్వే

ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ శనివారం నుంచి ప్రతి గ్రామ సచివాలయం పరిధిలోని సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలపై సర్వే నిర్వహించాలన్నారు. వాటన్నిటినీ క్రోడీకరించి, జూలై ఒకటో తేదీ నుంచి గ్రామాలకు వచ్చే అధికారుల బృందాలు అక్కడికక్కడే పరిష్కరిస్తాయన్నారు. ఇందుకోసం తహసీల్దార్, ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, డీటీలతో ప్రతి మండలంలోనూ రెండు బృందాలు పనిచేస్తాయన్నారు. అయితే రాజానగరం మండలంలో మాత్రం మూడు బృందాలు ఉంటాయన్నారు. సమస్యలు తెలిపిన గృహస్తులకు అందజేసే టోకెన్ ద్వారా ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులు బృందాలు ఏఏ తేదీలలో వచ్చేదీ తెలుస్తుందన్నారు. సమావేశంలో ఎండీఓలు బి.రామారావు, పీఎస్ రమేష్, కె.రమేష్, తహసీల్దార్లు పవన్ కుమార్, పాపారావు, సత్యనారాయణ రాజు, మండల కన్వీనర్లు దూలం పెద్ద, అడపా కనకరాజు, గంటా శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యులు వాసంశెట్టి పెద వెంకన్న, కర్రి నాగేశ్వరావు, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, ఎంపీపీలు గుర్రాల జ్యోత్స్న, సేవాదళ్ అధ్యక్షుడు డాక్టర్ బాబు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరావు, కొవ్విడి సర్రాజు, కరుటూరి హరిబాబు, గణేశుల పోశయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కాపవరంలో గడప గడపకూ..



కాపవరంలో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కాపవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాలను ఆయన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రజా సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు దరిచేర్చేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వంపై బురద చల్లేందుకు టీడీపీ నాయకులు అనేక విధాలా ప్రయత్నిస్తున్నారని, వీటిని నమ్మే స్థితిలో ఎవరూ లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలిచి మళ్లీ సీఎంను చేయాలని స్థానికులను ఆయన కోరారు. సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ భీష్ముడు, ఉప సర్పంచ్ పోసిన గోపాలకృష్ణ, వార్డు సభ్యులు మామిడాల హైమావతి, యాలుసూరి లక్ష్మి, గంగులూరి సూరిబాబు, సత్యంశెట్టి శ్రీను, కుంతం చక్రరావు, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ కర్రి గంగరాజు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

అనపర్తి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు వారి సంక్షేమానికి, అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అనపర్తి యూనిట్ దశమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ముందుగా అసోసియేషన్ హాలులో పెన్షనర్ల పితామహుడు దరమ్ స్వరూప్ నకారా విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు తమ అనుభవాలను సమాజాభివృద్ధికి వినియోగించి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించడంతో పాటు రూ. 9 లక్షల నిధులు మంజూరు చేశామని చెప్పారు. తన హయాంలో అసోసియేషన్ భవన నిర్మాణం పూర్తి కావడం పట్ల ఎమ్మెల్యే సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం అసోసియేషన్ భవన ప్రాంగణంలో ఎమ్మెల్యే మొక్కను నాటారు. ఆయన్ని అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సంఘ అధ్యక్షుడు పీవీఎస్ సూర్యనారాయణ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి ప్రభుదాసు, కోశాధికారి శర్మ, గొలుగూరి రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులకు లబ్ధి



సీఎం జగన్ ప్రసంగాన్ని లైవ్ స్ట్రీమింగ్ ద్వారా భారీ స్క్రీన్‌పై వీక్షిస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు

అనపర్తి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వివిధ పథకాలకు సంబంధించి అర్హత ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారుడికి లబ్ధి చేకూరుతుందని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అమరావతిలోని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి లైవ్ స్ట్రీమింగ్ ద్వారా మండల ప్రత్యేక అధికారి ఏబీవీ ప్రసాద్, ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి, తహసీల్దార్ వై.సరస్వతి తదితర మండల స్థాయి అధికారులు, సచివాలయాల్లో సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు వీక్షించారు. రామవరం గ్రామ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి హాజరయ్యారు. సర్పంచ్ గిరడా గంగాభవాని, ఎంపీటీసీలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, సచివాలయ కార్యదర్శి పీవీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రంగంపేటలో..

రంగంపేట: ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించడమే 'జగనన్న సురక్ష' ముఖ్య ఉద్దేశమని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టీవీ ద్వారా జగనన్న సురక్ష ప్రారంభ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి ఆయన తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలనే దిశగా ఈ కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, మండల ప్రత్యేకాధికారి డి.బాలశంకర్, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం.దొరకయ్య, ఎంపీడీఓ బి. శ్రీరామరాజు, ఈఓపీఆర్డీ కాత్యాయనీ పాల్గొన్నారు. మర్రిపూడి, నల్లమిల్లి సచివాలయాల వద్ద ఆయా గ్రామాల సర్పంచులు వేము మాధవి, నల్లా పద్మ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది కార్యక్రమాన్ని తిలకించారు.

వైఎస్సార్ బీమాతో భద్రత

అనపర్తి: ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ బీమా పథకం పేద కుటుంబాలకు భద్రతగా నిలుస్తోందని ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ అన్నారు. అనపర్తి గ్రామ సచివాలయం-5 పరిధికి చెందిన బయ్యవరపు గణపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్ బీమా ద్వారా అతని కుటుంబానికి మంజూరైన రూ. లక్షను శుక్రవారం మృతుడి భార్య వెంకటలక్ష్మికి ఎంపీపీ అందజేశారు. రాష్ట్ర భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖి చిట్టిరాజు, బాపనమ్మ గుడి పాఠశాల పీఎంసీ చైర్మన్ పడాల బుల్లిరెడ్డి, సచివాలయ కార్యదర్శి చిన్నం విజయ, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ కర్రి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని ముగ్గళ్లలో బాధిత కుటుంబానికి ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న శుక్రవారం వైఎస్సార్ బీమా తక్షణ సహాయం నగదును అందించారు. ఈనెల 21 ముగ్గళ్లకు చెందిన గెడ్డం నాగేంద్ర గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన భార్య భార్గవికి ఎంపీపీ జ్యోత్స్న, విజిలెన్స్, మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు సాదె చంటిబాబు, పార్టీ నాయకులు సుంకవల్లి సుబ్రహ్మణ్యం, సచివాలయం కన్వీనర్ కూచిపూడి బాబ్జీ, కోనే కోటేశ్వరరావు తదితరులు చేతుల మీదుగా వైఎస్సార్ బీమా పథకం తక్షణ సాయంగా రూ.10 వేలు అందించారు.

స్లూయిజ్ మరమ్మతులు పూర్తి

సీతానగరం: బొబ్బిల్లంక వద్దగల తొర్రిగడ్డ కాలువ స్లూయిజ్‌కు మరమ్మతులు పూర్తయ్యాయి. గత ఏడాది స్లూయిజ్ ఐదుగేట్లు మరమ్మత్తులకు గురవ్వడంతో గోదావరి వరద సమయంలో నీరు ఎగపోటుతో మిర్తిపాడు, ఉండేశ్వరపురం, బొబ్బిల్లంక పొలాలు ముంపుబారిన పడ్డాయి. వరద సమయంలో నీటిమట్టం ఎక్కువగా ఉంటే గేట్లు ఆటోమెటిక్‌గా మూసుకుపోతాయి. గోదావరి వరద నీటిమట్టం తక్కువగా ఉండి, కాలువలో నీటిమట్టం ఎక్కువగా ఉంటే గేట్లు తెరుచుకుంటాయి. కాగా.. పొలాల ముంపు నేపథ్యంలో ఆ సమయంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అయితే ఈ ఏడాది గోదావరి వరద వచ్చే సమయం దగ్గరలో ఉండడంతో గేట్లకు మరమ్మతులు చేపట్టారు. కొత్త గేట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జలవనరులశాఖ ఏఈ ఏ.శివప్రసాద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో కలెక్టర్ మంజూరు చేసిన డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) రూ 24.80 లక్షతో మరమ్మతులు పూర్తి చేశామన్నారు.